సాక్షి గుంటూరు

శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023




6,7 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి

తాడేపల్లిరూరల్: కొలనుకొండలో నిర్మిస్తున్న గోకుల క్షేత్రంలో ఈనెల 6,7 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు గోకులక్షేత్రం అధ్యక్షుడు వంశీధర దాస తెలిపారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 3,920 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 176 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 523.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

యార్డును సందర్శించిన మూడు రాష్ట్రాల కార్యదర్శులు



కొరిటెపాడు(గుంటూరు): తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన మార్కెటింగ్‌శాఖ సిబ్బంది, కార్యదర్శులు మూడు నెలల శిక్షణలో భాగంగా గురువారం గుంటూరులోని మిర్చి యార్డును సందర్శించారు. యార్డులో జరుగుతున్న క్రయ, విక్రయాలు.. మిర్చి యార్డుకు ఏఏ జిల్లాలు, రాష్ట్రాల నుంచి మిర్చి రైతులు తరలి వస్తారు.. ఏఏ రకాల మిర్చి వస్తుంది.. ఏఏ రకాలకు ఎంతెంత ధర లభిస్తుంది.. మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారులు ఏ విధంగా వ్యవహరిస్తారు.. రైతులకు యార్డులో కల్పిస్తున్న వసతులు, మిర్చిని కొనుగోలు చేసిన తర్వాత రైతులకు ఎన్ని రోజుల్లో డబ్బు చెల్లిస్తారు.. తదితర అంశాలపై యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డిలు వారికి వివరించారు. అనంతరం యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజానారాయణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన విధులను కార్యదర్శులు బాధ్యతగా నిర్వర్తిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని గుర్తుచేశారు. కార్యదర్శులు తీసుకునే నిర్ణయాలపై వేల కుటుంబాలు ఆధారపడి ఉంటాయని, ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మార్కెటింగ్‌శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు బి.రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో మహిళా ఎస్ఐ అభ్యర్థులకు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు గురువారం కొనసాగాయి. గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, ఒంగోలు పీటీసీ ప్రిన్సిపాల్ ఎ.ఆర్.దామోదర్ పోటీలను పరిశీలించారు. అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు తనిఖీ చేశారు. అనంతరం అభ్యర్థుల ఛాతీ, ఎత్తు కొలతలను మహిళా పోలీస్ సిబ్బంది తీసుకున్నారు. 1,600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. మహిళా అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఏఎస్పీలు కె.సుప్రజ (గుంటూరు), హైమావతి (ఎస్పీఎస్ఆర్ నెల్లూరు), గుంటూరు రేంజ్‌లోని కొందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, మహిళా పోలీస్ అధికార/సిబ్బంది, ఐజీ కార్యాలయపు సీఐ సుధాకర్, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

9న జాతీయ మెగా లోక్‌అదాలత్



నగరంపాలెం: గుంటూరు జిల్లాలోని ప్రతి కోర్టులో ఈనెల 9న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. జిల్లాలోని సబ్ డివిజన్ల పోలీస్ అధికారులు, పోలీస్‌స్టేషన్ల సీఐలతో గురువారం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జూమ్ వీడియో ద్వారా ఎస్పీ మాట్లాడారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వీలైనంత త్వరగా ఎక్కువ కేసులు పరిష్కరించాలని అన్నారు. జిల్లాలో ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే రాష్ట్ర డీజీపీ ఉత్తర్వుల ప్రకారం ఫామ్ నంబర్ ఒకటిని 48 గంటల్లో పూర్తి చేయాలని చెప్పారు. ఫామ్ నంబర్లు 5, 7 నిర్దేశించిన సమయంలో పూర్తి చేసి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అన్నారు. జిల్లాలో ప్రతి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన రోడ్డు ప్రమాదాల కేసుల్లో బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. స్పెషల్ గ్రేవ్, ముఖ్యమైన కేసుల్లో విచారణ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సంయుక్తంగా కోర్టుకు హాజరై, కేసులు వీగి పోకుండా దోషులకు కోర్టులో శిక్ష పడేలా వ్యవహరించాలని అన్నారు. ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు, ఎస్బీ ఇన్‌చార్జి సీఐ బాలసుబ్రమణ్యం, డీసీఆర్బీ సీఐ అనూరాధ, ఎస్ఐ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

రక్తహీనత కలిగిన గర్భిణులపై నిరంతర పర్యవేక్షణ

- సంపూర్ణ పోషణతో పౌష్టికాహారం అందించాలి
- పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలి
- కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశం



కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారితో నియామక ఉత్తర్వులు పొందిన అభ్యర్థులు

తెనాలి: రక్తహీనత కలిగిన గర్భిణులకు సంపూర్ణ పోషణను అందిస్తూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యసేవలతో సుఖప్రసవాలు జరిగేలా ఐసీడీఎస్, వైద్య, ఆరోగ్యశాఖ క్షేత్రస్థాయి ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి గురువారం తెనాలి మండలంలోని చావావారిపాలెం, అంగలకుదురులోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులు, ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

సీడీపీఓపై ఆగ్రహం

చావావారిపాలెం–2లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్లోరింగ్ కుంగిపోయి, అధ్వానంగా ఉండటాన్ని కలెక్టర్ గమనించారు. 20 రోజులుగా ఆ కేంద్రంలో కరెంటు సరఫరా లేదని తెలుసుకుని అంగన్‌వాడీ టీచర్, సీడీపీఓపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అంగన్‌వాడీ కేంద్రం మరమ్మతుల ప్రతిపాదనలపై, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో అలసత్వం చూపినందుకు సంబంధిత ఉద్యోగుల పర్యవేక్షణ అధికారులపై చర్యలకు సిఫార్సులు చేస్తూ ఉత్తర్వులు సిద్ధంచేయాలని ఐసీడీసీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను ఫోనులో ఆదేశించారు. కుంగిన ఫ్లోరింగ్ మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని ఇంజినీరింగ్, విద్యుత్ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చావావారిపాలెం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించిన కలెక్టర్, పనులు 15 రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. అంగలకుదురు గ్రామ నార్త్ ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధపెట్టాలని సూచించారు. సంపూర్ణ పోషణ కిట్లు అందించాలని చెప్పారు. వారికి క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు జరిగేలా చూడాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో పనులను పరిశీలించారు. చిన్నారులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం అంగలకుదురులో జగనన్న లే అవుట్‌లో నిర్మిస్తున్న విలేజ్ హెల్త్ వెల్నెస్ సెంటరును కలెక్టర్ పరిశీలించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణ పనులు సెప్టెంబరు 15 నాటికి పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

యువకుడి పింఛన్ మంజూరుకు సాయం

అంతకుముందు చావావారిపాలెంలో పుట్టిన దగ్గర్నుంచి మంచానికే పరిమితమైన 18 ఏళ్ల యువకుడు చింతాబత్తిని ఐజాక్ దుస్థితిని అతడి తల్లి ఎలిజెబెత్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లటంతో ఇంట్లోకి వెళ్లి మరీ ఆ యువకుడిని చూశారు. వేలిముద్రలు, ఐరిస్ పడకపోవడతో పింఛన్ రావడం లేదని తెలుసుకుని జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సదరం సర్టిఫికెట్ జారీ చేయించి, పింఛన్ వచ్చేలా చూడాలని ఆదేశించారు. స్థానిక చర్చి వద్ద మురుగు సమస్యను గుర్తించి పరిష్కరించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఓ వృద్ధురాలి వేదనను ఆలకించి, ఆమెకు తగిన సాయం చేయాలని అధికారులకు చెప్పారు. అంగలకుదురు నార్త్ ఎస్సీ కాలనీలో శ్మశానవాటిక విస్తరణ సమస్యపైనా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కె.రవిబాబు, మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ, పంచాయతీరాజ్ ఈఈ ముత్యంబాబు, డీఈఈ జీవోవీఎస్ గుప్తా, ఏఈ వెంకటేశ్వర్లు, సీడీపీఓ ఎం.సునీత, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



అంగలకుదురు పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

విభిన్న ప్రతిభావంతులకు నియామక పత్రాలు

గుంటూరు వెస్ట్: విభిన్న ప్రతిభావంతులు 17 మందికి కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 49 ఖాళీలకు నోటిఫికేషన్ జారీ చేశామని, అయితే కొన్ని పోస్టులకు సరైన అభ్యర్థులు లేకపోవడం, మరికొన్ని పోస్టులు సాంకేతిక క్లారిఫికేషన్స్ రావాల్సి ఉండడంతో ప్రస్తుతం 17 పోస్టులు భర్తీచేశామని, వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామని వెల్లడించారు. మిగతావి కూడా త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. అత్యంత పారదర్శకంగా జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో, జేసీ పర్యవేక్షణలో ఎంపిక నిర్వహించినట్టు వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, విభిన్న ప్రతిభావంతుల అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త, అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు–బీబీనగర్ లైన్ డబ్లింగ్‌పై దృష్టి

డీఆర్ఎం ఎం.రామకృష్ణ



లక్ష్మీపురం(గుంటూరు): గుంటూరు–బీబీనగర్ లైన్ డబ్లింగ్ పనులపై దృష్టి సారించాలని డీఆర్ఎం ఎం.రామకృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో గురువారం డీఆర్‌యూసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు రైల్వే డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించేందుకు డివిజన్ సిబ్బంది, అధికారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. డివిజన్ పరిధిలో చేపట్టే నూతన అభివృద్ధి పనులకు కేంద్రం ఇప్పటికే నిధులు కేటాయించిందన్నారు. నూతన పనులను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. రైళ్లలో సరుకు రవాణా, డివిజన్ ఆదాయాన్ని పెంచడానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. రైల్వేస్టేషన్‌లలో కోచ్ ఇండికేషన్ బోర్డులు, లిఫ్టులు, రైళ్లు ఆగిపోవడం, కొత్త రైళ్లను ప్రవేశపెట్టడం, స్టేషన్‌లలో పార్కింగ్ సౌకర్యం, పరిశుభ్రత, రైల్వే పోలీసుల భద్రత గురించి చర్చించారు. సమావేశంలో ఏడీఆర్ఎం, డీఆర్‌యూసీసీ చైర్మన్ ఆర్.శ్రీనివాస్, సీనియర్ డీసీఎం, డీఆర్‌యూసీసీ బ్రాంచ్ కార్యదర్శి ఎం.దినేష్‌కుమార్, సీనియర్ డీఓఎం పి.కిరణ్, డివిజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.2,500, గరిష్ఠ ధర రూ.4,500, మోడల్ ధర రూ.3,500 వరకు పలికింది.

కొండలమ్మకు వెండి పళ్లెం సమర్పణ

గుడ్లవల్లేరు(గుడివాడ): మండలంలోని వడ్లమన్నాడు గ్రామంలో వేంచేసిన శ్రీ కొండలమ్మ అమ్మవారికి గుడివాడకు చెందిన జి.వెంకట కిశోర్ గురువారం వెండి పళ్లెం సమర్పించారు. ఆలయ చైర్మన్ శేషం గోపి, ఈఓ కానూరి సురేష్‌కు 925 గ్రాముల వెండి తాంబూలపు పళ్లెం అందజేశారు. భక్తుడి పేరిట అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.



నేటి నుంచి పింఛన్ల పంపిణీ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభం కానుంది. గుంటూరు జిల్లాలో 2,51,290 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా కొత్తగా 6,409 పెన్షన్లు మంజూరయ్యాయి. కొత్త లబ్ధిదారులను కలుపుకొని 2,57,699 మందికి ప్రభుత్వం రూ.70.82 కోట్లు మంజూరు చేసింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందించనున్నారు.

క్రైంకర్మే

అంతులేని అవినీతి!

- క్రైంను అరికట్టాల్సిన వాళ్లే అడ్డదారుల్లో!
- క్రైం ఏఎస్పీ ఆధ్వర్యంలో జరగుతున్న ఓరల్ ఎంక్వైరీ
- ఇప్పటికే ఎస్బీ సీఐ వీఆర్‌కు.. డీఎస్పీకి మెమో జారీ?
- మరికొందరిపై వేటుపడే అవకాశం
- ఫలితంగా అక్రమ అధికారుల్లో ఆందోళన
- విచారణకు వెళ్తున్న సిబ్బందికి బెదిరింపులు
- నోరు మెదపొద్దని హుకుం



గుంటూరులో స్పెషల్ బ్రాంచి కార్యాలయం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): నేరాలను అరికట్టాల్సిన వాళ్లే నిబంధనలను బేఖాతర్ చేసి దురాగతాలకు పాల్పడుతున్నారు. స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ)పై వస్తున్న ఆరోపణలే దీనికి నిదర్శనం. ఎస్బీ విభాగంపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల ఆదేశాలతో చేపట్టిన విచారణలో అధికారుల అవినీతి నిగ్గుతేలుతోంది. దీంతో ఎస్బీ అధికారులతో కలిసి వసూళ్లకు పాల్పడిన ఇతర అధికారులకూ ముచ్చెమటలు పడుతున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు ఓరల్ ఎంక్వైరీ (ఓఈ)కి వస్తున్న కిందిస్థాయి సిబ్బందిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని సమాచారం. తమ అవినీతి గురించి చెప్పవద్దంటూ హుకుం జారీ చేస్తున్నారని తెలుస్తోంది. ఈ విషయం పోలీస్ శాఖలో చర్చనీయాంశమైంది. ఇటీవల ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ అయిన సిబ్బందినీ నేరమంతా తమపై వేసుకోవాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఎస్బీ సీఐను వీఆర్‌కు పంపగా, డీఎస్పీకి మెమో జారీ చేసినట్టు సమాచారం. మరికొందరిపై వేటు పడే అవకాశం ఉందని తెలుస్తోంది.

పాస్‌పోర్టు మొదలుకుని గిఫ్ట్‌ల వరకు వాటాలే

పాస్‌పోర్టు వెరిఫికేషన్ సమయంలో వసూలు చేసిన మొత్తంలో కచ్చితంగా ఉన్నతాధికారులకు వాటాలు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. గుంటూరు జిల్లా వ్యాప్తంగా నిత్యం ప్రతి స్టేషన్ పరిధిలో కనీసం మూడు నుంచి ఐదు పాస్‌పోర్టుల వెరిఫికేషన్ ఉంటుంది. దీనికి ఎస్బీ ఏఎస్ఐ లేకుంటే కానిస్టేబుల్ వెళ్తారు. పార్టీ నుంచి రూ.1,000 నుంచి రూ.2,000 వరకు వసూలు చేస్తున్నారు. దీనిలో ప్రతి పాస్‌పోర్టుకు సంబంధించి రూ.300 చొప్పున ఎన్ని అయితే అన్నింటికీ ఉన్నతాధికారులకు పంపాల్సిందేనని ఇండెంట్ వేసినట్టు సమాచారం.

- ఆఖరికి అధికారుల ఇళ్లకు సరుకులు, మద్యం బాటిళ్లు పంపడం పరిపాటిగా మారిందని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు.
- ఒక ఎస్బీ అధికారి అయితే గుంటూరులో కొత్తగా ఇల్లు అద్దెకు తీసుకున్న క్రమంలో తన పరిధిలో పనిచేసే సిబ్బంది చార్ట్ పక్కన పెట్టుకుని మరీ ఒక్కొక్కరూ ఒక్కో గిఫ్ట్ (ఫోన్, టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్ తదితరాలు) ఇవ్వాలని ఇండెంట్ వేశారని తెలుస్తోంది.
- పేకాట, లాడ్జిల్లో వ్యభిచారం నడిపే వారి నుంచి గిఫ్ట్‌ల రూపంలో భారీగా దండుకుంటున్నట్లు సమాచారం. కొందరు బంగారు వస్తువులూ తీసుకున్నట్లు చర్చ జరుగుతోంది.

పూర్తిస్థాయి నివేదిక అందజేస్తాం

ఎస్బీ అధికారుల విషయంలో పూర్తిస్థాయిలో విచారణ చేశాం. మరోమారు ఇతరత్రా అంశాలు ఏమైనా ఉంటే పరిశీలిస్తాం. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.

– ఎ.శ్రీనివాసరావు, ఏఎస్పీ

సిబ్బంది ఇచ్చిన సమాచారం ఆధారంగా వసూళ్లు

జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది అవినీతి, రేషన్, పేకాట, సింగిల్ నంబర్ లాటరీ వంటి మాఫియాల సమాచారాన్ని నేరుగా జిల్లా ఎస్పీకి అందించాల్సిన బాధ్యత స్పెషల్ బ్రాంచిది. అయితే కిందిస్థాయి సిబ్బంది ఇచ్చిన సమాచారం ఆధారంగా కొందరు అధికారులు వసూళ్లకు పాల్పడ్డారని సమాచారం.

కీలక వ్యక్తి సహకారం

జిల్లా పోలీసు కార్యాలయంలో కీలకంగా ఉండే వ్యక్తి ఒకరు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులకు పూర్తి సహాయసహకారాలు అందిస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలోని ఆయా స్టేషన్ల నుంచి విచారణకు వస్తున్న సిబ్బందిని నేరుగా పిలిపించి మరీ క్లాస్ తీసుకుంటున్నట్టు సమాచారం. విచారణలో నోరు మెదిపితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో సిబ్బంది నిజం చెబితే ఏమవుతుందో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఓరల్ ఎంక్వైరీ పూర్తి కావటంతోపాటు, అధికారులు, సిబ్బందిని ప్రక్షాళన చేయాలని సంబంధిత విచారణ అధికారి సూచించినట్లు తెలిసింది.



- గుంటూరు నుంచి విజయవాడకు వెళ్లే మార్గంలో ఉండే ఒక స్టేషన్ అధికారి అక్రమాల గురించి సిబ్బంది సమాచారం ఇస్తే ఆ అధికారిని పిలిపించి భారీ స్థాయిలో ముడుపులు తీసుకున్నట్టు తెలిసింది. పైగా సమాచారం ఇచ్చిన అధికారిని నెల రోజుల పాటు వీఆర్‌లో పెట్టినట్లు సిబ్బంది చెబుతున్నారు.
- గుంటూరు రూరల్ పరిధిలో ఒక స్టేషన్‌కు చెందిన ఎస్బీ సిబ్బందిపై ఫిర్యాదు వస్తే సదరు సిబ్బంది నుంచి డబ్బులు తీసుకుని ఆ ఫిర్యాదును బుట్టదాఖలు చేసినట్లు తెలిసింది.
- ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలో కూడా ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ అయిన అధికారిని మళ్లీ అదే విభాగంలోకి తీసుకోవడం వెనుక కూడా డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి.

మృతులు, డబుల్ ఎంట్రీ ఓట్ల తొలగింపుపై విచారణ



చావావారిపాలెంలో మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి. పక్కన సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

తెనాలి: నీల ఫిలిప్.. వీఆర్వోగా పనిచేశారు. 2020 నవంబరులో చనిపోయారు. ఆయన ఓటు గ్రామ ఓటరు జాబితాలో ఉండటంతో అధికారులు తనిఖీ చేసి తొలగించారు.

- చుక్కా శ్రీకాంత్, చుక్కా మరియదాసు ఈ రెండు పేర్లు ఒకరివే. రెండు పేర్లతో రెండు ఓట్లు ఉన్నాయి. అధికారుల తనిఖీలో ఓటరు అభీష్టం ప్రకారం మరియదాసు పేరుతో గత ఓటును తొలగించారు.
- రుద్రపాటి భాగ్యలక్ష్మి అనే మహిళకు రెండు చోట్ల ఓటు ఉంది. విచారించి ఒకటి తీసేశారు.
- సంతోష్ అనే అతను చనిపోయాడు. అతడి కొడుకు, కోడలు ఏలూరులో ఉంటున్నారు. అక్కడ వారిద్దరికీ ఓటు హక్కు లభించింది. అధికారులు విచారణ చేసి, ఆ ముగ్గురి ఓట్లను జాబితాలో నుంచి తొలగించారు.

స్పెషల్ సమ్మర్ రివిజన్ 2024లో భాగంగా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, తెనాలి నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి/తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి గురువారం రూరల్ మండలం చావావారిపాలెంలో తొలగించిన ఓట్లపై విచారణ చేశారు. క్షేత్రస్థాయి తనిఖీలో భాగంగా ముందుగా తొలగించిన ఓటర్ల వివరాలను తెలుసుకున్నారు. తర్వాత వారి ఇళ్లకు వెళ్లారు. సంబంధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తమ సమ్మతితోనే అధికారులు ఓట్లను తొలగించినట్టు వారు నిర్ధారించారు. అదేవిధంగా బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వో)లు ఇంటింటికీ వచ్చి, ఓటరు కార్డులను పరిశీలించారని కలెక్టర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కలెక్టర్ వెంట తెనాలి నియోజకవర్గ ఏఈఆర్ఓ/మండల తహసీల్దారు కె.రవిబాబు, ఎన్నికల ఉపతహసీల్దార్ ప్రసాద్, సూపర్‌వైజర్ వాసు, బీఎల్ఓ గీత, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

కౌలు రైతుకూ భరోసా

- 6,987 మంది రైతులకు రూ.5.24 కోట్లు లబ్ధి
- నేడు బటన్ నొక్కి ఖాతాలకు జమ చేయనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కొరిటెపాడు(గుంటూరు): తోటి రైతుల నుంచి భూమి కౌలుకు తీసుకుని పంట సాగు చేసే కౌలుదారులకు కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'రైతు భరోసా' పథకం ద్వారా సాయం అందిస్తోంది. రైతు భరోసా కేంద్రాల వారీగా అలాంటి నిరుపేద కౌలుదారులను గుర్తించి క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు(సీసీఆర్‌సీ) పేరున సాగు హక్కు పత్రాలు అందించే కార్యక్రమం కొనసాగిస్తోంది. సీసీఆర్‌సీ ద్వారా పంట రుణాలు, రైతు భరోసా వంటి ప్రయోజనాలు వర్తింపజేస్తుండటంతో కౌలుదారులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఈ ఏడాదికి సంబంధించి మొదటి విడత జూన్ మాసంలో ఇప్పటికే వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ ద్వారా 1,16,700 మంది రైతులకు రూ.87.53 కోట్లు జమ చేశారు.

తాజాగా కౌలు రైతులకు కూడా భరోసా అందిస్తున్నారు. గుంటూరు జిల్లాకు సంబంధించి 6,987 మంది కౌలు రైతులకు రూ.5 కోట్ల, 24 లక్షల, 2 వేల 500 మంజూరైనట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు గురువారం 'సాక్షి'కి తెలిపారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి కౌలుదారుల బ్యాంకు ఖాతాల్లోకి భరోసా సొమ్మును జమ చేయనున్నారని ఆయన వెల్లడించారు.

రూ.90.09 లక్షలకు కొబ్బరి చెక్కల టెండర్



సీల్డ్ టెండర్ బాక్స్‌ను తెరుస్తున్న అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు సమర్పించిన కొబ్బరి చెక్కలను పోగు చేసుకునే హక్కు టెండర్‌ను అమృత ట్రేడర్స్ రూ.90,09,999లకు దక్కించుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఆరో అంతస్తులో ఏఈఓ చంద్రశేఖర్ పర్యవేక్షణలో గురువారం ఈ టెండర్ ప్రక్రియ కొనసాగింది. బహిరంగ వేలం, సీల్డ్ టెండర్, ఈ–టెండర్ విధానం ద్వారా ఈ ప్రక్రియను నిర్వహించారు. విజయవాడకు చెందిన అమృత ట్రేడర్స్, శ్రీనివాస స్టోర్స్, ఎం.విజయ్‌చంద్ సప్లయర్స్ ప్రతినిధులు రూ.5 లక్షలు ప్రథమ ధరావత్తుగా చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొన్నారు. దేవస్థానం పాటను రూ.85 లక్షలుగా నిర్ణయించి వేలాన్ని ప్రారంభించింది. బహిరంగ మార్కెట్‌లో కొబ్బరి ధర లేకపోవడంతో అంత మొత్తానికి తాము పాట కొనసాగించలేమని కాంట్రాక్టర్లు చెప్పడంతో దేవస్థానం పాటను రూ.80 లక్షలకు తగ్గించింది. అనంతరం కాంట్రాక్టర్లు పాటను క్రమంగా రూ.86 లక్షల వరకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి పాట ముందుకు వెళ్లకపోవడంతో అధికారులు సీల్డ్ టెండర్ బాక్స్‌ను తెరిచారు. సీల్డ్ టెండర్ బాక్స్‌లో అమృత ట్రేడర్స్ రూ.90,09,999లకు కోట్ చేసింది. దీంతో అమృత ట్రేడర్స్ అత్యధిక మొత్తానికి పాటను దక్కించుకున్నట్లు అధికారులు ప్రకటించారు.

అమృతలింగేశ్వరుడికి వెండి కవచం



జగ్గయ్యపేట: మండలంలోని ముక్త్యాల గ్రామంలో వేంచేసిన కోటిలింగ హరిహర మహాక్షేత్రంలో కొలువైన అమృతలింగేశ్వరుడికి దాతలు గురువారం వెండి కవచం అందజేశారని ఈఓ శిరీష తెలిపారు. జగ్గయ్యపేటకు చెందిన విజయలక్ష్మి దంపతులు రూ.లక్ష వెచ్చించి సుమారు కిలో వెండితో తయారు చేసిన కవచాన్ని అందజేశారు. దాతలకు స్వామి వారి ప్రసాదాలు అందించి, శేషవస్త్రంతో సత్కరించారు.

బాల్య వివాహాల నిరోధానికి ప్రత్యేక చర్యలు

వేటపాలెం: అధికారులంతా సమన్వయంతో పనిచేస్తూ బాల్య వివాహాల నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి సూచించారు. మండలం పరిషత్ సమావేశ హాలులో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు-అనర్థాలపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

జీజీహెచ్‌లో రూ. 40 లక్షలతో స్టెప్ డౌన్ ఐసీయూ


స్టెప్ డౌన్ ఐసీయూ పనులు పర్యవేక్షిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ రూ. 40 లక్షలతో అధునాతన వెంటిలేటర్‌లతో స్టెప్‌డౌన్ ఐసీయూను అభివృద్ధి చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. గురువారం ఆసుపత్రిలోని స్టెప్ డౌన్ ఐసీయూ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద రోగుల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తూ నిధులు విడుదల చేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా జీజీహెచ్‌లో వెంటిలేటర్ ఐసీయూను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అత్యవసర వైద్య విభాగానికి అనుబంధంగా స్టెప్‌డౌన్ ఐసీయూను నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ప్రోత్సాహంతో, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. కొత్తగా నిర్మిస్తున్న ఐసీయూలో ప్రతి బెడ్‌కు వెంటిలేటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణ బాబు ఆసుపత్రి అభివృద్ధి కోసం రూ.5 కోట్లు కేటాయించారన్నారు. అందులో రూ.40 లక్షలు స్టెప్ ఐసీయూ కోసం ఖర్చు పెడుతున్నామనివెల్లడించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేసి సెప్టెంబర్ మసానికి అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ఎస్ శ్రీనివాస ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, సమీనా బేగం పాల్గొన్నారు.

ఘనంగా విజయకీలాద్రిపై ఉపాకర్మ


ఉపాకర్మ నిర్వహిస్తున్న జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేద విద్యార్థులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శ్రావణ పూర్ణిమను పురస్కరించుకుని ఉపాకర్మను గురువారం ఘనంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళా శాసనసములతో త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేద విద్యార్థులు ఉపాకర్మను నిర్వహించారని తెలిపారు. ఉపాకర్మ అనేది వేదాధ్యయన ప్రారంభమయ్యే రోజు అని, ఇది శ్రావణ మాసం పౌర్ణమి రోజున నిర్వహిస్తారని తెలిపారు. బ్రహ్మదేవుడి నుంచి అసురులు దోచుకున్న వేదాన్ని విష్ణువు అశ్వరూపం ధరించి పునరుద్ధరించడంతో ఈ రోజు విశేషమని, శ్రీ మహావిష్ణువు గుర్రపు రూపాన్ని తీసుకున్నందున ఈ అవతారాన్ని హయగ్రీవ అవతారమని పిలుస్తారని వివరించారు. ఉపాకర్మ అంటే హిందూమతంలోని నాలుగు వేదాలలో ఒకటైన యజుర్వేదాన్ని నేర్చుకోవడానికి ప్రారంభించే రోజని, నేడు బ్రాహ్మణులు నూతన యజ్ఞోపవీతాన్ని ధరిస్తారని తెలిపారు. అదేవిధంగా చాతుర్యాస దీక్ష 60వ రోజున శ్రీయాగం, శ్రీ సీతారాముల శాంతి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించామని వేద విద్యార్థులు ఉపాకర్మను నిర్వహించారని తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, రంగబళి చిత్ర దర్శకులు పవన్ బాసంశెట్టి దంపతులు పాల్గొన్నారు.

మహిళల హక్కులపై అవగాహన అవసరం


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ రూపొందించిన మహిళల హక్కులపై అవగాహన అవసరం అనే కరపత్రాన్ని గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, సమాజంలో ప్రతిఒక్కరూ బాలికలు, మహిళల పట్ల బాధ్యతగా నడుచుకోవాలని సూచించారు. మహిళల హక్కుల పరిరక్షణకు ఉన్న చట్టాలను తెలుసుకోవటం ద్వారా రక్షణ పొందవచ్చని వివరించారు. కరపత్రాన్ని రూపొందించిన హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు.

నేటి నుంచి మండల స్థాయిలో క్రీడా ఎంపికలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2023-24 విద్యాసంవత్సరానికి శుక్రవారం నుంచి ఈనెల 5వ తేదీ వరకు మండలస్థాయిలో క్రీడా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ, స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఈ నెల 6వ తేదీ నుంచి 10 వరకు నియోజకవర్గ స్థాయిలో క్రీడా ఎంపికలను పూర్తి చేయాలని సూచించారు. కబడ్డీ, ఖో-ఖో, టెన్నికాయిట్, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్‌లలో మండల, నియోజకవర్గస్థాయిలో క్రీడా ఎంపికలకు తగు ఏర్పాట్లు చేసుకుని, సకాలంలో ఎంపికలు పూర్తి చేయాలని ఆదేశించారు. మండల, నియోజకవర్గస్థాయి ఎంపికలు పూర్తవ్వగానే జిల్లాస్థాయిలో ఆయా క్రీడాంశాలతో పాటు మిగిలిన క్రీడల ఎంపికలకు సంబంధించిన షెడ్యూల్ త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు అకడమిక్ మానిటరింగ్‌లో విధిగా నమోదు చేసుకోవాలని, ఆ విధంగా చేయని క్రీడాకారులను ఎంపిక చేయబోమని స్పష్టం చేశారు. అండర్-11, అండర్-14, అండర్-17 విభాగాల వారీగా పాల్గొనాలని సూచించారు.

రెడ్డి జేఏసీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా అనురాధారెడ్డి



నరసరావుపేట రూరల్: రెడ్డి జేఏసీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా సీహెచ్ అనురాధారెడ్డి నియమితులయ్యారు. విశాఖపట్నంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రెడ్డి జేఏసీ గౌరవ అధ్యక్షుడు పాలిమేర వెంకటరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు విప్పల శివకుమార్‌రెడ్డి, చేతుల మీదుగా నియామకపత్రాన్ని అనురాధారెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా అనురాధారెడ్డి మాట్లాడుతూ జేసీ మహిళా విభాగం బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు.

బ్యాంకు అప్రైజర్ చేతివాటం

- కుదవబెట్టిన 304 గ్రాముల బంగారంతో ఉడాయించిన వైనం
- నిఘా కెమెరాల ద్వారా గుర్తించిన బ్యాంక్ అధికారులు
- అలాగే బినామీ పేర్లతో నకిలీ బంగారం తాకట్టు పెట్టిన వైనం
- రూ.65 లక్షలకు పైగా బ్యాంకుకు టోకరా పెట్టిన ఘనుడు
- యద్దలపాడు యూనియన్ బ్యాంకులో ఘటన


యూనియన్ బ్యాంక్ యద్దలపాడుశాఖ

యద్దలపాడు: ఖాతాదారులు తనఖా పెట్టిన బంగారంతో బ్యాంక్ అప్రైజర్ ఉడాయించిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. బ్యాంక్ – ఖాతాదారులకు మధ్య వారధిలా ఉండాల్సిన వ్యక్తి మోసానికి పాల్పడిన విషయాన్ని గుర్తించి అప్రమత్తమైన బ్యాంక్ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. యద్దలపాడు గ్రామంలోని యూనియన్ బ్యాంక్‌లో జరిగిన ఈ సంఘటనపై బ్యాంక్ మేనేజర్ ఇచ్చిన ప్రాథమిక సమాచారం మేరకు.. బాపట్ల జిల్లా చీరాల సమీపంలోని పూసపాడు గ్రామానికి చెందిన స్వర్ణకార వృత్తిని నిర్వహించుకునే నిడమానూరి హరీష్ కుటుంబం యద్దలపాడుకు వలస వచ్చింది. గత 9 ఏళ్లుగా ఆంధ్రబ్యాంక్ యద్దలపాడు శాఖలో అప్రైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం బ్యాంకులో ఏడుగురు ఖాతాదారులు సుమారు 304 గ్రాములు బంగారాన్ని బ్యాంకులో కుదవపెట్టారు. మధ్యాహ్నం భోజనానికి వెళ్లిన అప్రైజర్ ఎంతకూ విధులకు రాలేదు. దీంతో బ్యాంక్ మేనేజర్‌తో పాటు సిబ్బంది ఫోన్లు చేసినా స్విచ్‌ఆఫ్ అయింది. ఇంటికెళ్లిన అప్రైజర్ తిరిగి రాకపోవడం, సెల్ స్విచ్‌ఆఫ్ కావడం, బ్యాంకులోనూ బంగారం కనిపించపోవడంతో అనుమానంతో నిఘా కెమెరాలను పరిశీలించారు. ఆ బంగారాన్ని సదరు అప్రైజరు జేబులో పెట్టుకోవడం బ్యాంక్ అధికారులు సీసీ ఫుటేజ్‌ల్లో గుర్తించి వెంటనే బ్యాంక్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారి సూచనల మేరకు బ్యాంక్ అధికారి పోలీసులను ఆశ్రయించారు.

అన్ని గోల్డ్‌ఖాతాల పరిశీలన...

జరిగిన విషయం తెలుసుకున్న బ్యాంక్ ఉన్నతాధికారులు యద్దలపాడు శాఖకు వచ్చారు. సేఫ్ లాకర్‌లో ఉంచి బంగారం, వాటిని తనఖా పెట్టిన ఖాతాదారులు వివరాలపై ఆడిట్ నిర్వహణ చేపట్టారు. మొత్తం 1886 గోల్డ్ ఖాతాలు యద్దలపాడు శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని బుధ, గురువారాల్లో 500 ఖాతాలను పరిశీలన చేశారు. వీటిలో 30 ఖాతాలలో హరీష్ వేరువేరు పేర్లతో తాకట్టు పెట్టి రూ.40 లక్షలు డబ్బులు తీసుకునట్లు.. ఆయా ఖాతాల్లో ఉంచినదంతా నకిలీ బంగారమేనని ఆడిట్ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ప్రాథమిక సమాచారం పోలీసులకు అందించినట్లు బ్యాంక్ అధికారులు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో ఆడిట్ నిర్వహించాక పూర్తి సమాచారం పోలీసులకు అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఖాతాదారులు ఆందోళన చెందవద్దు..

తమ శాఖలో బంగారం కుదువ పెట్టిన ఖాతాదారులకు సంబంధించిన బంగారం అంతా బ్యాంకులోనే భద్రంగా ఉందని బ్యాంక్ అధికారులు మీడియాతో చెప్పారు. అనవసరపు పుకార్లు నమ్మవద్దని, తమ ఖాతా స్లిప్పులతో వస్తే వారు తాకట్టు పెట్టిన బంగారం చూపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

పచ్చదనం పెంపునకు చర్యలు

పల్నాడు కలెక్టర్ శివశంకర్ లోతేటి


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ శివశంకర్ లోతేటి, అటవీ శాఖ అధికారి రామచంద్రరావు

నరసరావుపేట రూరల్: జిల్లాలో పచ్చదనం పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలని పల్నాడు కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం కలెక్టర్ శివశంకర్ లోతేటి అధ్యక్షతన జిల్లా ఫారెస్ట్రీ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరావు, డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి బెన్ని, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు మాట్లాడుతూ 2022-23 సంవత్సరంలో 12 లక్షల మొక్కలు నాటే లక్ష్యం కాగా 14.04లక్షల మొక్కలను నాటినట్లు తెలిపారు. 2023-24సంవత్సరానికి 68లక్షలు అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ల ద్వారా మొక్కలు నాటేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. సామాజిక అటవీశాఖ, టెర్రిటోరియల్ ద్వారా 15లక్షలు మొక్కలు పెంచేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికుడు అంకారావు పాల్గొని విత్తన బంతులను తయారుచేసి, అటవీప్రాంతంలో చల్లటంలో తన అనుభవాలను తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, ఐటీసీ మేనేజర్లు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యార్డుకు 25,917 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): స్థానిక మార్కెట్ యార్డుకు గురువారం 25,917 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 24,927 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,000 నుంచి రూ.22,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,500 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,038 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఆర్‌బీకేలను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు


రైతులతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

ఈపూరు: రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటున్నాయని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఈపూరులో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ రైతులతో సమావేశమై చర్చించారు. రైతులు తమకు వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు రాయితీపై కావాలని ఎంపీ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన మంత్రితో ఈ విషయంపై చర్చించి పనిముట్లు రాయితీపై వచ్చేలా చూస్తామన్నారు. ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పలు సేవలను ప్రతిఒక్క రైతు సద్వినియోగం చుకోవాలని సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ఆర్.రామారావు, ఉద్యానవన శాఖ అధికారులు డి.నవీన్‌కుమార్, ఎస్‌కే నబీ రసూల్, వ్యవసాయ సహాయకుడు ఎం.శేషుబాబు, రైతులు పాల్గొన్నారు.

రేపు ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ స్నాతకోత్సవం

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ పరిధి నీరుకొండలోని ఎస్ఆర్ఎం వర్సిటీ 3వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ టిఆర్ పారివేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సెప్టెంబర్ 2న నిర్వహించే యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిధిగా తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై విచ్చేయనున్నారని, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రెసిడెంట్, మాజీ డీఎస్‌టీ సెక్రటరీ డాక్టర్ అశుతోష్ శర్మకు గౌరవ డాక్టరేట్ అందజేయనున్నామని, అదేవిధంగా 883 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు డిగ్రీలు, మెడల్స్ తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా ప్రదానం చేయనున్నామని, ఉత్తమ ప్రతిభ కనబర్చిన 17 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, ఆరుగురికి సిల్వర్ మెడల్స్, ఇద్దరి బ్రాంజ్ మెడల్స్ ప్రదానం చేయనున్నామని, 13 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు డిగ్రీలు అందజేయనున్నామని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన


హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న సునీత

వేటపాలెం: రెసిడెన్సియల్ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రైవేటుకు దీటుగా బోధన చేయాలని ఎస్సీ స్టాండింగ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎమ్మెల్సీ పోతుల సునీత సూచించారు. ఆమె గురువారం మండలంలోని దేశాయిపేటలో గల మహాత్మా జ్యోతిరావు పూలే వెనకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న సదుపాయాల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూ పాటిస్తున్నారా లేదా అని విద్యార్థుల్ని అడిగి తెలుసుకున్నారు. విద్య, వైద్యంపై సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. నాడు-నేడు కింద రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేటుకు దీటుగా మార్చారని చెప్పారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఆమె వెంట మల్లెల బుల్లిబాబు, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సరోజినీదేవి ఉన్నారు.

రేపు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల వార్షిక సమావేశాన్ని శనివారం ఉదయం 9.00 గంటలకు గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆడుదాం ఆంధ్ర, జోనల్ క్రీడల నిర్వహణపై నిర్వహిస్తున్న వార్షిక సమావేశానికి జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను విధిగా పంపాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

మెగా జాబ్ మేళాకు 342 మంది హాజరు


మంజూరు పత్రాలను అందజేస్తున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు

పర్చూరు (చినగంజాం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కాలేజీలో గురువారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 342 మంది హాజరయ్యారు. మొత్తం హాజరైన వారిలో 85 మందికి ఉద్యోగాలకు ఎంపికయ్యారని బాపట్ల జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఈ. తమ్మాజీరావు తెలిపారు. జాబ్ మేళాకు అపెక్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్, మాల్‌టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హెటిరో డ్రగ్స్, ఫ్లెక్స్‌టెక్ సొల్యూషన్స్, ఐసీఐసీఐ, సీఈటీసీ రెన్యూవబుల్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, అమర రాజా బ్యాటరీస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఫస్ట్ సోర్స్, హీరో మోటో కార్ప్ వంటి 11 కంపెనీలకు పైగా ప్రముఖ బహుళజాతి కంపెనీలు హాజరయ్యాయని చెప్పారు.

జీతం వారి విద్యార్హతలను బట్టి రూ.10 వేలు నుంచి రూ. 35 వేలు వరకు ఉంటుందని తెలిపారు. జిల్లా ఉపాధి అధికారి రాజారావు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఒక సువర్ణ అవకాశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్ హారిక సౌగంధి, మల్లీశ్వరి, ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ నాగ వెంకట్, కళాశాల ప్రిన్సిపాల్ ఈ. చింపారెడ్డి, సీహెచ్.వి.రవికిరణ్, ఏడీఎస్‌డీఈ సిబ్బంది పాల్గొన్నారు.

డీ-13 విద్యుత్ శాఖ కార్యాలయం మార్పు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ డీ-13 నూతన కార్యాలయం నవభారత్‌నగర్ 1వలైనులోకి మార్చినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస బాబు గురువారం తెలిపారు. గతంలో ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చినట్లు వెల్లడించారు. 1, 2, 57 వార్డులు డీ-13 సెక్షన్ పరిధిలోకి వస్తాయన్నారు. సీతారామ్‌నగర్, అంబేడ్కర్‌నగర్, అరుంధతీనగర్, మంగళదాస్‌నగర్, రాజగోపాలనగర్, డీఆర్టీనగర్, మద్దిరాల కాలనీ, షాప్ ఎంప్లాయిస్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఎన్టీఆర్‌నగర్, ఇజ్రాయిల్‌పేట, గాంధీనగర్, రాహుల్ గాంధీనగర్, జీయావుద్దీన్‌నగర్, నందివెలుగు రోడ్డు, నవభారత్‌కాలనీ, రాఘవ నగర్‌లు డీ-13 సెక్షన్ పరిధిలోకి వస్తాయన్నారు. వినియోగదారులు గమనించాలన్నారు.

సంపదనంతా అదానీ, అంబానీలకు దోచి పెడుతున్న కేంద్రం

పర్చూరు (చినగంజాం): దేశంలోని సంపదనంతా అదానీ, అంబానీలకు కేంద్ర ప్రభుత్వం దోచి పెడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. గ్యాస్ ధరలు రూ.200 తగ్గించి ప్రజల్ని మోసం చేస్తున్నారని ఆయన విమర్శించారు. గురువారం పర్చూరు కోర్టుకు ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గ్యాస్ కనెక్షన్ ఉన్నవారు కోటి మంది ఉంటే అందులో ఉజ్వల పథకం లబ్ధిదారులు కేవలం నాలుగు లక్షలు మాత్రమే ఉన్నారని తెలిపారు. జాతీయ రహదారుల పేరుతో కేంద్ర ప్రభుత్వం రైతుల్ని మోసం చేస్తోందని విమర్శించారు. ఎకరా భూమి రూ. 1.40 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించిన కేంద్రం రైతులకు మాత్రం రూ.20 లక్షలు మాత్రమే చెల్లిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రాజకీయం అస్తవ్యస్తంగా ఉందని, బీజేపీ ఆడినట్లు వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేనలు ఆడుతున్నాయని ఆయన విమర్శించారు.